క్లుప్తంగా

రైతులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

కోటపల్లి: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని జెడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కోటపల్లి రైతువేదికలో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు రైతుబంధు, రైతు బీమా పథకాలు ప్రవేశపెట్టి వెన్నుదన్నుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, ఎంపీపీ మంత్రి సురేఖ, డీఆర్డీవో శేషాద్రి, ఏఈవో రాజ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల జాబితా ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక మోడల్ స్కూల్లో 2023–24 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న 358మంది అభ్యర్థుల మెరిట్, స్థానికత, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికైన విద్యార్థుల జాబితా పాఠశాల నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు చెందిన ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, మోమో, బోనఫైడ్ జిరాక్స్‌పత్రాలతో పాటు టీసీ, రెండు పాస్ ఫొటోలు జూన్ 5నుంచి 9వరకు పాఠశాలలో అందజేసి అడ్మిషన్లు పొందాలన్నారు. సంబంధిత ధ్రువీకరణపత్రాలు సమర్పించకుంటే అడ్మిషన్ రద్దు చేసి మెరిట్ ప్రకారం తదుపరి విద్యార్థికి ప్రవేశంకు అవకాశం కల్పిస్తామన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌లో శనివారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని, ప్రజలతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. ఆమె వెంట సర్పంచ్ శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: నిబంధనలు ఉల్లంఘించి అడ్మిషన్లు చేపట్టిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. భవనాలు పూర్తికాకుండా, అడ్మిషన్లు చేపట్టిన కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు.

వ్యక్తిగత భద్రత ముఖ్యం

శ్రీరాంపూర్: విధి నిర్వహణలో ఉద్యోగులకు వారి వ్యక్తిగత భద్రత ఎంతో ముఖ్యమని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఎస్సార్పీ 3, 3ఏ గనిపై శనివారం రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో ఉద్యోగులు రక్షణ నియమాలు పాటిస్తూ, తమ వ్యక్తిగత భద్రతను కూడా పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ సంతోష్ కుమార్, సిమ్టార్ ఇన్‌చార్జి విజయ్ కుమార్, గని రక్షణాధికారి మహేందర్, ఫిట్ అసిస్టెంట్ సెక్రటరీ సాదుల భాస్కర్, వెంటిలేషన్ అధికారి అరుణ్ కుమార్‌తో పాటు శ్రీనివాస్, సాయి, శ్రావణ్, పూర్ణచందర్, మల్లికార్జున్, రామకృష్ణ పాల్గొన్నారు.

'ఎంపీని శిక్షించాలి'

పాతమంచిర్యాల: రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని భారత్ బచావో జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, మనోహర్, రాజేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

పాతమంచిర్యాల: రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషన్‌ను అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బస్టాండ్ ఎదుట శనివారం బ్రిజ్‌భూషణ్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తోకల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై సీఎం స్పందించాలి'

జన్నారం: చట్టసభల్లో బీసీలకు జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, ఈ విషయంపై సీఎం కేసీఆర్ స్పందించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని బీసీ కులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ ప్రకటించేలా చూడాలన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు కలిసిరావాలని కోరారు.

ఘనంగా రైతు దినోత్సవం

నెన్నెల/మందమర్రిరూరల్/వేమనపల్లి/తాండూర్/చెన్నూర్‌రూరల్/భీమిని: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఊరూరా రైతు దినోత్సవం నిర్వహించారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై ప్రసంగించారు. నెన్నెల మండలం రైతువేదికలో మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వ్యవసాయాన్ని పండుగలా మార్చి, సాగు పథకాలు అమలు చేయడంతో రైతే రాజయ్యాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టడంతో అన్నదాతల్లో కొండంత ధైర్యం వచ్చిందన్నారు. పాటలు పాడి సందడి చేశారు. రైతుల్లో ఉత్సాహాన్ని నింపారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి రైతులకు గొప్ప స్థానం కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. డప్పుచప్పుళ్లు, ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. కన్నెపల్లి, భీమిని మండలాల్లో జెడ్పీసీఈఓ కాకిరాల నరేందర్, డీఎల్‌పీఓ ఫణీందర్‌రావు, జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. సంక్షేమ పథకాల గురించి రైతులకు వివరించారు. మందమర్రి మండలంలోని శంకర్‌పల్లిలో ముఖ్య అతిథిగా ఎంపీపీ గుర్రం మంగ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. వేమనపల్లిలో ఎడ్లబండ్లతో రైతులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతువేదికలో ఎంపీపీ కోలి స్వర్ణలత, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు భీమన్న, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. తాండూర్‌లో ఆయా గ్రామాల నుంచి రైతులు ఎడ్లబండిపై ఊరేగింపుగా వచ్చి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. వేడుకల్లో ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, వైఎస్ ఎంపీపీ నారాయణ, పీఏసీఎస్ చైర్మెన్ దత్తుమూర్తి తదితరులు పాల్గొన్నారు. చెన్నూర్‌లో ర్యాలీ లు చేపట్టి, అనంతరం రైతువేదికల్లో ఆదర్శ రైతులను సన్మానించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఆస్నాదలో ఎడ్లబండ్లతో ర్యాలీగా వస్తున్న రైతులు



కన్నెపల్లిలో ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ



తాండూర్: మాట్లాడుతున్న జెడ్పీటీసీ బానయ్య



వేమనపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వర్ణలత



మాట్లాడుతున్న స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు

పట్టణ అభివృద్ధిలో ఎమ్మెల్యే విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



13వ వార్డులో పర్యటిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో, అభివృద్ధి పనులు చేపట్టడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని 13వ వార్డు వేములబస్తీలో గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం పర్యటించారు. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వస్తున్న మురుగు నీరు, రోడ్ల మీదకు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీంతో వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీలో కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా, కనీసం తాగునీరు అందించడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ, మేనసూరి, తోట మల్లిఖార్జున్, ముదాం మల్లేశ్, కుచాడి సతీశ్ తన్నీరు కృష్ణ పాల్గొన్నారు.

తల్లి, బిడ్డలకు పునర్జన్మనిచ్చిన 'ఎయిమ్స్' వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ యెగ్గెన ఆధ్వర్యంలో తల్లి, బిడ్డలకు వైద్య చికిత్సలు అందించి వారికి పునర్జన్మనిచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. లక్సెట్టిపేట మండల కేంద్రానికి అక్షయ 34వారాల గర్భంతో తీవ్ర వెన్నుపోటు, తుంటినొప్పితో నడువలేని స్థితిలో ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. ఆమెకు ఎంఆర్‌ఐతో పాటు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, పరీక్షల అనంతరం పైయోజెనిక్ సాక్రోఇల్లిటిస్ సెప్టిసెమియాగా నిర్ధారించామన్నారు. అప్పటికీ తల్లికి ఉమ్మనీరు చాలా తక్కువగా ఉండటంతో తల్లి, బిడ్డలు ప్రాణపాయ స్థితిలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఎమర్జెన్సీగా ఈ సెక్షన్ చేసి బిడ్డను ఎన్‌ఐసీయూలో, తల్లిని ఐసీయూలో 15రోజుల పాటు వైద్యుల నిరంతర పర్యవేక్షణలో పూర్తి అనుభవాన్ని ఉపయోగించి, తల్లిబిడ్డలను ప్రాణపాయ స్థితి నుంచి తప్పించినట్లు తెలిపారు. పూర్తి ఆరోగ్యంగా ఉన్న వారిని శనివారం డిశ్చార్జి చేశామని డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా శిశువు కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య పరీక్షలు అందించిన వైద్యులు అలివేణి గొంత్యాల, సునీత, శ్రీకాంత్ యెగ్గెన, కోటేశ్వర రావు, సాగర్, వైద్య సిబ్బంది ఉన్నారు.



తల్లీబిడ్డలతో ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు

మత్స్యకారులకు పరిహారం ఇప్పించాలి

మందమర్రిరూరల్: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో గత సంవత్సరం వరదల కారణంగా కేజ్ కల్చర్ యూనిట్లు కొట్టుకుపోయాయని వాపోయారు. సంఘం సభ్యులు శనివారం హైదరాబాద్‌లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చైర్మన్ పిట్టల రవీందర్‌ను నష్టపోయిన మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా పరిహారం ఇప్పించాలని, ఇతర సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు తిరుపతి, రవీందర్, కనుకయ్య, ఐలయ్య తదితరులు ఉన్నారు.

తెలంగాణ రాష్ట్రంతోనే రైతు అభివృద్ధి



గుడిపేటలో ఎడ్లబండి నడుపుతున్న ఎమ్మెల్యే



కోలాటం ఆడుతున్న మహిళలు

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట/నస్పూర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే రైతుల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శనివారం లక్సెట్టిపేట, నస్పూర్ లోని సీతారాంపల్లి రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని సూచించారు. తమ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగగా మార్చిందని తెలిపారు. నస్పూర్‌లో రైతులకు సామూహిక సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. లక్సెట్టిపేటలోని దౌడపల్లి, జెండా వెంకటాపూర్, సూరారం, వెంకట్రావుపేట గ్రామాల్లో ట్రాక్టర్లతో రైతులు ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో లక్సెట్టిపేటలో డీసీఎమ్మెస్ చైర్మన్ లింగన్న, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ వెంకటేష్ పాల్గొన్నారు. నస్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హాజీపూర్ మండలంలోని ముల్కల్ల, గుడిపేట, కర్ణమామిడి గ్రామాల్లోని రైతువేదికలు అందంగా ముస్తాబు చేయగా మండలంలోని 17గ్రామ పంచాయతీలకు చెందిన రైతులు పాల్గొన్నారు. కొంతమంది రైతులు ఎడ్లబండ్లను అందంగా అలంకరించి రాగా, రైతులతో పాటు మహిళలు కోలాటం ఆడుతూ రైతువేదికల వరకు ర్యాలీగా తరలివచ్చారు. రైతువేదికల్లో ముందుగా రైతుబంధు, రైతుబీమా లబ్ధిదారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, ఆదర్శ రైతులుగా నిలుస్తున్న పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా వేడుకల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ వేణు, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేశ్ తదితరులు హాజరయ్యారు.

ఓపెన్‌కాస్ట్ గనిపై గేట్ మీటింగ్

శ్రీరాంపూర్: కోల్ ఇండియాలో లేని హక్కులను సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో ఇప్పటివరకు 20,000మంది యువతకు ఎక్స్‌ట్రనల్ ద్వారా, కారుణ్య ఉద్యోగాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. 9న నస్పూర్‌లో నిర్వహించే సభకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, జీఎం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నర్సయ్యకు సన్మానం

బెల్లంపల్లి: సింగరేణి రిటైర్డు కార్మికుడు, సీనియర్ క్రీడాకారుడైన బెల్లంపల్లికి చెందిన యాదండ్ల నర్సయ్యకు శనివారం ఆత్మీయ సన్మానం చేశారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి నర్సయ్యను శాలువాతో సత్కరించారు. కోలిండియా క్రీడాపోటీల్లో సింగరేణి తరపున 18సార్లు పాల్గొన్నారని, 8సార్లు విజేతగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తొంగల మల్లేష్, శ్రేణులు రాంమ్మోహన్, ఉస్మాన్, ఖలీల్, బలరాం, మొండయ్య పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు నిరసనలు వ్యక్తం చేయకుండా శనివారం హాజీపూర్ మండలంలోని బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

పరామర్శ

జైపూర్: మండల జెడ్పీటీసీ మేడి సునీతకు మామ, షెట్‌పల్లి సర్పంచ్ మేడి రవికి తండ్రి మేడి నర్సయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ శనివారం రాత్రి పరామర్శించారు. వారిని ఓదార్చి అండగా ఉంటానని భరోసానిచ్చారు. జైపూర్ రైతు వేదికలో 9న సీఎం కేసీఆర్ సభ నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించి సభ విజయవంతం చేయాలని తెలిపారు. 22వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో వైభవంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో చిన్నారులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు.

డంప్‌యార్డు ఎత్తి వేయాలని రాస్తారోకో

బెల్లంపల్లి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన జన నివాసాలకు చేరువలో ఏర్పాటు చేసిన డంప్‌యార్డును వెంటనే ఎత్తివేసి, పొగ నివారణ చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి కొత్తబస్టాండ్ చౌరస్తాలో స్థానికులు రాస్తారోకో చేశారు. తెల్లవారు జామున 7గంటల ప్రాంతంలో స్థానికులు సామూహికంగా తరలివచ్చి రాస్తారోకో చేసి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఆందోళనకారులకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంసీపీఐ(యూ) శ్రేణులు, మున్సిపల్ వార్డు కౌన్సెలర్ మద్దతుగా నిలిచి రాస్తారోకోలో పాల్గొన్నారు. నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అక్కడికి చేరుకోగా ఆందోళన కారులు ఒక్కసారిగా ఆయనను చుట్టుముట్టి, ప్రశ్నల వర్షం కురిపించారు. చెత్త పోయకుండా నివారించడంతో పాటు నీళ్లు చల్లించి మంటలు చెలరేగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య అక్కడికి చేరుకుని ఆందోళన కారులు, కమిషనర్‌తో సంప్రదింపులు జరిపి ఆందోళన విరమణకు కృషి చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.కృష్ణ, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు స్వామి, మున్సిపల్ కౌన్సెలర్ అఫ్జర్, బీఆర్‌ఎస్ పార్టీ కన్నాల బస్తీ నాయకుడు బానేష్, మహిళ నాయకురాలు అలేఖ్య, ఆనంద్, వెంకటేష్, ఆయా బస్తీల వాసులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న స్థానికులు

'రైతులను ప్రభుత్వం మోసం చేస్తోంది'

భీమారం: రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు రామిళ్ల రాధిక ఆరోపించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేయని కారణంగా కల్లాల్లోనే వేలాది బస్తాల ధాన్యం పడి ఉందని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారని ఆరోపించారు. వర్షాలు వస్తాయనే భయంతో రైతులు ధాన్యంతోనే గడుపుతుంటే, ప్రభుత్వం మాత్రం రైతువేదికల్లో సంబురాలు చేస్తోందని విమర్శించారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేసేంత వరకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందని ఆమె తెలిపారు. సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు గుడిమల్ల వెంకటేశ్, లాజర్, లింగస్వామి, రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధిక

'బడిబాట'లో ఉపాధ్యాయులు



ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బడిబాట



దండేపల్లిలో...



సోమనపల్లిలో...

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరుతూ అవగాహన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని అర్కలవాడ, ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సీడీపీవో స్వరూప ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యతో పాటు, చిన్నారులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, టీచర్ పద్మ, రేణుక, సహాయకురాలు లత పాల్గొన్నారు.

తాండూర్: విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకర్షించడం కోసం శనివారం తాండూర్ మండలంలో 'బడి బాట' కార్యక్రమం ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన జరుగుతున్న తీరు తెన్నులను గ్రామీణులకు వివరించి అవగాహన కల్పించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఉచితంగా నోట్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ అందజేస్తున్నట్లు తెలిపారు. 'మనఊరు–మనబడి' కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దినట్లు ప్రచారం చేశారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరినట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ...

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 3ఏళ్ల వయస్సు కలిగిన చిన్నారుల బరువు కొలతలు తీసుకోగా, మూడేళ్ల వయస్సు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత, కార్యకర్తలు సుజాత, లీలా, ఆయాలు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి సెక్టారు పరిధిలోని సోమనపల్లి గ్రామంలో ఒకటి, రెండు అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. కార్యక్రమానికి డీడబ్ల్యూవో చిన్నయ్య, సీడీపీవో మనోరమ హాజరయ్యారు. ఈ నెల 3వ తేదీ నుంచి జూలై 12వ తేదీ వరకు అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలో మూడేళ్లు నిండిన పిల్లల ఇళ్లకు వెళ్లి అంగన్‌వాడీలో పిల్లలను చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భీమిని శారద, సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు దేవేంద్ర, శోభారాణి, వనజాకుమారి, మాధవి, నాగమణి, ఏఎన్‌ఎం హరిత, ఆశ కార్యకర్తలు రాజమణి, ప్రియాంక, తల్లులు, పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

దండేపల్లి: బడిబాట కార్యక్రమంలో భాగంగా దండేపల్లిలోని పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించుకోవడంతో పాటు, 5వ తరగతి పూర్తిచేసిన వారిని ఆరోతరగతిలో చేర్పించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు. కొండాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించగా లక్సెట్టిపేట సీడీపీవో రేష్మా, సూపర్‌వైజర్ వాణి పాల్గొన్నారు.

ఆధార్‌సేవలు సద్వినియోగం చేసుకోండి

పాతమంచిర్యాల: తపాలాశాఖ ద్వారా ప్రజలు తమ ఇంటివద్దనే ఆధార్‌సేవలను పొందవచ్చని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ అధికారి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నపిల్లలకు కొత్త ఆధార్‌కార్డు నమోదు కోసం ఎలాంటి రుసుం తీసుకోరని, 5సంవత్సరాల నుంచి 15 ఏళ్ల పిల్లలకు మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ ఉచితంగా చేస్తారని, 7 ఏళ్ల నుంచి 17ఏళ్ల వయస్సు వారికి మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం రూ.100వసూలు చేస్తారన్నారు. ఆధార్‌కార్డులో పుట్టిన తేదీలు, అడ్రస్‌లు మార్పుకోసం రూ.50వసూలు చేస్తామన్నారు. వార్డు కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకుంటే జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్‌లో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రామారావు, పోస్ట్‌మాస్టర్లను సంప్రదించాలన్నారు. వివరాలకు ఏఎస్‌పీ 9347081345, పోస్ట్ మాస్టర్ 9849379141లలో సంప్రదించాలన్నారు.



తపాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆధార్ కేంద్రం

మంచిర్యాలటౌన్: తపాలశాఖ ఆధార్ సేవలను జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసినట్లు 3, 4తేదీల్లో ఆధార్ కేంద్రంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ బదావత్ ప్రకాశ్‌నాయక్ అన్నారు. ఎన్టీఆర్‌నగర్ కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రంను మంచిర్యాల అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రామారావు ఆధ్వర్యంలో ప్రారంభించారు.

'తరగతుల అడ్డగింత'

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): గుడిపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుండడంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అడ్డుకుని డీఈఓ, ఎంఈఓలకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తిరుపతి, మల్లేశ్, హర్షిత్, వంశీ పాల్గొన్నారు.